క్లుప్తంగా

17న కుమారి నిత్యారెడ్డి భరతనాట్య అరంగేట్రం

అంబర్‌పేట: జయేంద్ర కళాకేంద్రం ఆధ్వర్యంలో భరతనాట్యంలో శిక్షణ పొందిన కుమారి నిత్యారెడ్డి ఈ నెల 17న అరంగేట్రం చేయనున్నట్లు నిర్వాహకురాలు కంచర్ల ప్రశాంతి రాజశేఖర్‌రెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఐటెక్ సిటీ శిల్పకళా వేదికపై అరంగేట్ర కార్యక్రమం ఉంటుందన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి, సంగీత నాట్య అకాడమీ అవార్డు గ్రహీత కళారత్న పి.రామలింగ శాస్త్రీ, తెలంగాణ సంగీత నాటక అకాడమీ చైర్ పర్సన్ దీపికారెడ్డి హాజరవుతారన్నారు.

బీజేపీ రాష్ట్ర ఎగ్జిక్యూటివ్ మెంబర్‌గా పార్థసారధి



సుందరయ్య విజ్ఞాన కేంద్రం: బీజేపీ రాష్ట్ర ఎగ్జిక్యూటివ్ మెంబర్‌గా బీజేపీ సీనియర్ నాయకులు చా తిరి పార్థసారధి సగర నియమితులయ్యారు. ఈ మేరకు గురువారం బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు బండి సంజయ్ నియామక పత్రాన్ని అందజేశారు. అనంతరం చిక్కడపల్లిలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో పార్థసారధి మాట్లాడుతూ.. బీజేపీ బలోపేతానికి కృషి చేసినందుకు అధిష్ఠానం గుర్తించి రాష్ట్ర ఎగ్జిక్యూటివ్ సభ్యులుగా నియమించడం ఆనందంగా ఉందన్నారు.

'దశాబ్ది ఉత్సవాల పేరిట ప్రజాధనం దుర్వినియోగం'



ఆకుల ప్రవీణ్

కవాడిగూడ: సిద్దిపేట జిల్లా దుబ్బాక నియోజకవర్గంలో దశాబ్ది ఉత్సవాల పేరిట బీఆర్ఎస్ పార్టీ ప్రజల మభ్యపెడుతుందని ప్రజాధనాన్ని దుర్వినియోగం చేస్తుందని వైఎస్ఆర్‌టీపీ ముషీరాబాద్ నియోజకవర్గ కోఆర్డినేటర్ ఆకుల ప్రవీణ్ ఆరోపించారు. దుబ్బాక నియోజకవర్గంలో వడగండ్ల కన్నీళ్లుగా మారుతుంటే దశాబ్ది ఉత్సవాల పేరిట ప్రజలకు తీవ్ర అన్యాయం చేస్తున్నారని మండిపడ్డారు. రోజుకో ఉత్సవం పేరిట బీఆర్ఎస్ పార్టీ కార్యకర్తలకు ప్రజాధనం అందజేస్తున్నారని ఇప్పటికైనా రైతులకు నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు.

విద్యార్థుల ఆత్మహత్యలకు ప్రభుత్వమే బాధ్యత వహించాలి

ముషీరాబాద్: బాసర ట్రిబుల్ ఐటీలో వరుసగా జరుగుతున్న విద్యార్థుల ఆత్మహత్యలకు ప్రభుత్వమే బాధ్యత వహించాలని పీడీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షులు పరశురాం ఆరోపించారు. రెండ్రోజుల క్రితం దీపిక, గురువారం లికిత క్యాంపస్ ఆవరణలో ఆత్మహత్యలకు పాల్పడడం పట్ల ప్రభుత్వం బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సంగారెడ్డి జిల్లాకు చెందిన దీపిక ఆత్మహత్యకు చీఫ్ వార్డెన్ మధుసూదన్, స్టూడెంట్ డీన్ దత్తు కారణమని విద్యార్థులు ఆరోపిస్తున్నారని వీటిపై విచారణ జరిపి బాధ్యులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు.


దరఖాస్తుల ఆహ్వానం

కాచిగూడ: సైబర్ సెక్యూరిటీ కోర్సుల్లో ఆన్‌లైన్‌లో శిక్షణ కోసం తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా ఆసక్తి గల అభ్యర్థుల నుంచి దరఖాస్తులను స్వీకరిస్తున్నట్లు నేషనల్ అకాడమీ ఆఫ్ సైబర్ సెక్యూరిటీ ఇండియా డైరెక్టర్ విమలా రెడ్డి తెలిపారు. ఇంటర్, డిగ్రీ, పీజీ, ఇంజినీరింగ్, పాలిటెక్నిక్ డిప్లొమా అభ్యర్థులు ఆన్‌లైన్‌లో జూన్ 24వ తేదీ లోపు దరఖాస్తు చేసుకోవాలన్నారు.

అమరవీరుల కుటుంబాలకు గౌరవ పింఛన్ ఇవ్వాలి

కాచిగూడ: తెలంగాణ అమరవీరుల కుటుంబాలకు గౌరవ పింఛన్‌ను ఇవ్వాలని జాతీయ బీసీ మహాసభ అధ్యక్షుడు రాజేందర్ పటేల్ గౌడ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం తెలంగాణ అమరవీరులను గుర్తించి వారి కుటుంబాలను ఆదుకోవాలని కోరుతూ వారికి మద్దతుగా కాచిగూడ, నింబోలిఅడ్డలో ర్యాలీ నిర్వహించారు. తెలంగాణ అమరవీరుల కుటుంబాలలోని ఒక వ్యక్తికి ప్రభుత్వ ఉద్యోగం, మూడెకరాల భూమి, రెండు పడక గదుల ఇంటిని ఇవ్వాలని అన్నారు. కార్యక్రమంలో దరణీధర్, ప్రదీప్, తుంగబాబు, లక్ష్మయ్య, ఆగమయ్య, రాజేందర్ పాల్గొన్నారు.

పరామర్శ



కిరణ్‌కుమార్ కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న లక్ష్మణ్

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: రాంనగర్ డివిజన్ బీజేపీ సీనియర్ నాయకులు, బీజేవైఎం రాష్ట్ర మాజీ మీడియా కోఆర్డినేటర్ గాజుల కిరణ్‌కుమార్ తల్లి శిరేఖ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. గురువారం బాగ్‌లింగంపల్లిలోని శ్రీరామ్‌నగర్ బస్తీలో కిరణ్‌కుమార్ కుటుంబ సభ్యులను ఎంపీ డాక్టర్ లక్ష్మణ్ పరామర్శించారు.

కారు.. వర్గపోరు

- అధికార పార్టీలో గ్రూపు రాజకీయాలు
- ఎమ్మెల్యే ప్రోద్బలంతోనే హౌస్ అరెస్టులు, నివాసాల ముట్టడంటూ బీఆర్ఎస్ నేతల ఆరోపణలు

అంబర్‌పేట: బీఆర్ఎస్‌లో వర్గ విభేదాలు రాజుకుంటున్నాయి. తెలంగాణ దశాబ్ది ఉత్సవాల సాక్షిగా కలహాలు బహిర్గతమయ్యాయి. అధికార పార్టీ నాయకులు నియోజకవర్గంలో మూడు నాలుగు వర్గాలుగా రాజకీయాలు నడిపిస్తుండటంతో నాయకులు, కార్యకర్తలు గందరగోళానికి గురవుతున్నారు. పార్టీలో ఒకరిపై ఒకరు ఆరోపణలు, ప్రత్యారోపణలకే పరిమితం కాకుండా, సొంత పార్టీ నేతల ఇళ్లను సైతం ముట్టడి చేస్తుండటంతో అంబర్‌పేట్ నియోజకవర్గంలో తీవ్ర చర్చనీయాంశంగా మారింది.

మొన్న గృహ నిర్బంధం, నేడు ఇంటి ముట్టడి ..

దశాబ్ది ఉత్సవాలను ఘనంగా నిర్వహించి పార్టీ ప్రతిష్టను ప్రజల్లో పెంచాలని అధిష్ఠానం భావిస్తుండగా అంబర్‌పేటలో అందుకు భిన్నంగా పరిణామాలు చోటు చేసుకుంటున్నాయి. విద్యుత్ ఉత్సవాల్లో భాగంగా పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి ఎడ్ల సుధాకర్‌రెడ్డి తన అనుచరులతో కలిసి ఉత్సవాలు జరుగుతున్న వేదికపైకి వెళ్లి అధికారులను సత్కరించారు. అక్కడే ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్ వేదికపై ఉన్నారు. దీంతో ఇరు వర్గాలకు చెందిన కార్యకర్తలు ఎవరికి అనుకూలంగా వారు నినాదాలు చేసుకున్నారు. అనంతరం మొయిన్ చెరువుపై చెరువుల పండగ కార్యక్రమానికి ఎడ్ల సుధాకర్‌రెడ్డి తన అనుచరులతో వెళ్లడానికి సిద్ధపడగా పోలీసులు అడ్డుకుని హౌస్ అరెస్టు చేశారు. తమ హౌస్ అరెస్టును ఎమ్మెల్యే చేయించారని వారు ఆరోపించారు. నల్లకుంట బీఆర్ఎస్ మాజీ కార్పొరేటర్ గరిగంటి శ్రీదేవిరమేష్ ఇంటిని బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు ముట్టడించారు. పార్టీ సీనియర్ నాయకులు గరిగంటి రమేష్ దిష్టిబొమ్మను అతని ఇంటి ముందే దహనం చేయడంతోఅంతా అవాక్కయ్యారు.

గ్రూప్ రాజకీయాలు..

నియోజకవర్గంలోని అధికార పార్టీలో గ్రూప్ రాజకీయాలు వాడివేడిగా సాగుతున్నాయి. గతంలో పార్టీకి చెందిన గోల్నాక డివిజన్ కార్పొరేటర్ దూసరి లావణ్య శ్రీనివాస్‌గౌడ్, ఎమ్మెల్యేకు ఉన్న విభేదాలతో ఎవరికి వారు అన్నట్లుగా వ్యవహరిస్తున్నారు. అలాగే బాగ్‌అంబర్‌పేట మాజీ కార్పొరేటర్ పద్మావతిరెడ్డి, ఎమ్మెల్యేకు పార్టీ డివిజన్ అధ్యక్షుల నియామకం సందర్భంగా ఎమ్మెల్యేతో విభేదాలు తలెత్తాయి. కాగా కాచిగూడ మాజీ కార్పొరేటర్ భర్త ఎక్కల కన్నతో ముందు నుంచి ఎమ్మెల్యేతో ఉన్న విభేదాలతో ఎవరికి వారే గ్రూప్ రాజకీయాలు నడిపించుకుంటున్నారు. అలాగే నల్లకుంట మాజీ కార్పొరేటర్ గరిగంటి శ్రీదేవి, అంబర్‌పేట డివిజన్ మాజీ కార్పొరేటర్ పులి జగన్‌లు ఎమ్మెల్యేను విభేదిస్తూ వస్తున్నారు. మొత్తానికి నియోజకవర్గంలో ఎమ్మెల్యే, పార్టీ నియోజకవర్గం ఇన్‌చార్జీ ఎడ్ల సుధాకర్ రెడ్డి, కార్పొరేటర్లు, మాజీ కార్పొరేటర్లు పార్టీలో ఉంటూ ఎవరికి వారు తమదైన శైలిలో రాజకీయాలు చేస్తుండటంతో ఎవరికి మద్దతు తెలుపాలో అర్థంకాక పార్టీ నేతలు, కార్యకర్తలు ఆయోమయానికి గురవుతున్నారు.

గరిగంటి ఇల్లు ముట్టడి, స్వల్ప ఉద్రిక్తత



గరిగంటి ఇంట్లోకి దూసుకు వెళ్తున్న నాయకులను అడ్డుకుంటున్న పోలీసులు

నల్లకుంట: అంబర్‌పేట నియోజకవర్గంలో దళిత బంధు లబ్ధిదారుల ఎంపికలో ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్ కమీషన్ తీసుకున్నారని అధికార పార్టీకి చెందిన సీనియర్ నాయకుడు గరిగంటి రమేష్ ఇటీవల ఆరోపణలు చేశారు. ఈ నేపథ్యంలో దళితబంధు లబ్ధిదారులు ఎమ్మెల్యేకు కమీషన్ ఇచ్చినట్లు నిరూపించాలని డిమాండ్ చేస్తూ గురువారం బీఆర్ఎస్ దళిత నాయకులు, దళిత బంధు లబ్ధిదారులు న్యూ నల్లకుంటలోని గరిగంటి ఇంటిని ముట్టడించారు. గరిగంటికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ ఆయన ఇంట్లోకి దూసుకెళ్లేందుకు యత్నించగా పోలీసులు అడ్డుకున్నారు. అనంతరం గరిగంటి దిష్టి బొమ్మకు చెప్పుల దండవేసి శవయాత్ర చేస్తూ దహనం చేశారు.

ఎమ్మెల్యే ప్రోద్బలంతోనే దాడులు..

అంబర్‌పేట: నియోజకవర్గంలో బీఆర్ఎస్ పార్టీని బలహీనపర్చేందుకు ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్ వ్యవహరిస్తున్నారని ఆ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి ఎడ్ల సుధాకర్‌రెడ్డి, మాజీ కార్పొరేటర్ గరిగంటి శ్రీదేవి ఆరోపించారు. నల్లకుంటలో గురువారం మాజీ కార్పొరేటర్ గరిగంటి శ్రీదేవి ఇంటిని బీఆర్ఎస్ శ్రేణులు ముట్టడించడాన్ని తప్పు పడుతూ విలేకరులతో సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. సొంత పార్టీ నేతలను పార్టీ కార్యక్రమాలను చేయకుండా ఎమ్మెల్యే అడ్డకోవడం ఆయన రాజకీయ అవగాహనరాహిత్యానికి నిదర్శనమన్నారు. వ్యాపారులు, స్థిరపడ్డ వారికి దళితబంధు కేటాయించినట్లు వచ్చిన ఫిర్యాదులపై తాము స్పందిస్తే తమ ఇంటిని ముట్టడిస్తారా అని ప్రశ్నించారు. ఎమ్మెల్యే ప్రోద్బలంతోనే ఇలాంటి దాడులు జరుగుతున్నాయన్నారు. సమావేశంలో నాయకులు గరిగంటి రమేష్, విజితారెడ్డి, నగేష్ గౌడ్ పాల్గొన్నారు.

ప్రాణహాని ఉంది రక్షణ కల్పించండి

నల్లకుంట: దళిత బంధు లబ్ధిదారుల ఎంపికలో ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్ అవినీతికి పాల్పడ్డారంటూ బీఆర్ఎస్ నాయకుడు గరిగంటి రమేశ్ చేసిన ఆరోపణను నిరసిస్తూ బీఆర్ఎస్ దళితనేతలు, దళిత బంధు లబ్ధిదారులు ఆయన ఇంటిని ముట్టడించారు. ఈ నేపథ్యంలో ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్ అనుచరులైన బీఆర్ఎస్‌కు చెందిన పలువురు దళిత నాయకులతో తమకు ప్రాణహాని ఉందని గరిగంటి రమేశ్ సతీమణి నల్లకుంట మాజీ కార్పొరేటర్ గరిగంటి శ్రీదేవి గురువారం నల్లకుంట పోలీసులకు ఫిర్యాదు చేశారు. బీఆర్ఎస్ దళిత నాయకులు పెద్ద ఎత్తున తమ ఇంటిని ముట్టడించి ఇంట్లోకి చొరబడేందుకు యత్నించి భయాందోళనలకు గురి చేశారని ఇదే విషయమై నగర పోలీసు కమిషనర్‌కు కూడా ఫిర్యాదు చేస్తున్నట్లు తెలిపారు. తమకు రక్షణ కల్పించాలని పోలీసులను కోరారు.

పద్మశాలీ యువతకు ఉచిత శిక్షణ, వసతి



మాట్లాడుతున్న కందగట్ల స్వామి

కాచిగూడ: దేశంలో యూపీఎస్సీ నిర్వహించే సివిల్ సర్వీసెస్ 2023 పరీక్ష రాసేందుకు సిద్ధమవుతున్న పద్మశాలీ యువతకు ఉచితంగా శిక్షణ, ఉచిత వసతి కల్పించనున్నట్లు అఖిల భారత పద్మశాలీ సంఘం జాతీయ అధ్యక్షుడు కందగట్ల స్వామి, ఇంజినీర్స్ విభాగం జాతీయ అధ్యక్షుడు పుట్టపాండు రంగయ్య, నార్త్ అమెరికా పద్మశాలీ అసోసియేషన్ ఇండియా కో ఆర్డినేటర్ చింప ప్రభాకర్ తెలిపారు. గురువారం నారాయణగూడలోని పద్మశాలి భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. దేశానికి సేవ చేయడంతో పాటు ఉన్నత ఉద్యోగాల్లో పద్మశాలీ యువత స్థిరపడాలనే తపనతో ఈ శిక్షణ తరగతులు ఏర్పాటు చేశామన్నారు. ఉచిత శిక్షణకు హాజరయ్యే అభ్యర్థులు ఈ నెల 22 వరకు దరఖాస్తు చేసుకోవాలని మరింత సమాచారం కోసం 9490118558 నంబర్‌ను సంప్రదించాలన్నారు. ఈ కార్యక్రమంలో నక్కా వేణుమాధవ్, యర్రమాద వెంకన్న, సుధాకర్ పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల అందజేత



చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే ముఠాగోపాల్

చిక్కడపల్లి: దేశంలో ఎక్కడా లేని విధంగా ముఖ్యమంత్రి కేసీఆర్ సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నారని ఎమ్మెల్యే ముఠాగోపాల్ అన్నారు. నియోజకవర్గానికి చెందిన 27 మందికి మంజూరైన సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను గురువారం ఎమ్మెల్యే అందజేసి మాట్లాడారు. పేద మధ్యతరగతి ప్రజలకు సీఎంఆర్‌ఎఫ్ అండగా నిలుస్తుందన్నారు. అర్హులంతా ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలకు దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ముఠా జైసింహ, ముచ్చకుర్తి ప్రభాకర్, ముఠానరేశ్, శ్రీనివాస్, శ్రీనివాస్‌గుప్తా, సత్యనారాయణ పాల్గొన్నారు.

పనుల జాప్యంపై ఫిర్యాదు

అంబర్‌పేట: వర్షాకాలం ముంచుకొస్తున్నా నియోజకవర్గంలో చేపట్టిన అభివృద్ధి పనుల్లో తీవ్ర జాప్యం జరుగుతుందని నియోజకవర్గానికి చెందిన పలువు రు కార్పొరేటర్లు గురువారం జీహెచ్ఎంసీ జోనల్ కమీషనర్ శ్రీనివాస్ రెడ్డిని కలిసి ఫిర్యాద చేశారు. కార్పొరేటర్లు కన్నె ఉమారమేష్ యాదవ్, పద్మవెంకట్‌రెడ్డి, దూసరి లావణ్య శ్రీనివాస్ గౌడ్, విజయ్‌కుమార్ గౌడ్, అమృతలు డివిజన్‌లలో తలెత్తుతున్న సమస్యలపై జెడ్సీతో చర్చించారు. రోడ్ల తవ్వకాలు, నాలా పూడికతీత పనుల్లో పురోగతి లేదన్నారు.



జోనల్ కమీషనర్ శ్రీనివాస్‌రెడ్డితో కార్పొరేటర్లు

రైతులకు బ్యాంకు రుణాలు అందించాలి



మాట్లాడుతూ వెంకన్న

కవాడిగూడ: రైతులందరికి విత్తనాలు, ఎరువులు, బ్యాంకు రుణాలు తక్షణమే అందించాలని అఖిల భారత రైతు కూలీ సంఘం(ఏఐకేఎంఎస్) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మండల వెంకన్న డిమాండ్ చేశారు. గురువారం పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. వాస్తవ సాగుదారులైన కౌలు రైతులతో పాటు పోడు సాగుదారులకు ఇన్‌పుట్ సబ్సిడీలు, పంట నష్టపరిహారం, పంట రుణాలు అందించాలని డిమాండ్ చేశారు. రైతులకు విత్తనాలు, ఎరువులు అందుబాటులో ఉండాలన్నారు. నకిలీ ఎరువులు, విత్తనాలు సరఫరా చేసే వారిపై చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. ఏరువాక ప్రారంభమైన వ్యవసాయ శాఖ ఎరువులను అందుబాటులో ఉంచకపోవడం రైతుల పట్ల నిర్లక్ష్యానికి నిదర్శమని పేర్కొన్నారు. తెలంగాణ ప్రభుత్వం రైతులకు సకాలంలో ఎరువులు, విత్తనాలు, రుణాలు తక్షణమే అందించకపోతే రాష్ట్రవ్యాప్తంగా వ్యవసాయ కార్యాలయాల ముందు ధర్నాలు చేస్తామని హెచ్చరించారు.

సన్మానం



పద్మజను సన్మానిస్తున్న జాలిగామ అశోక్

నల్లకుంట: తెలంగాణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా వైద్య ఆరోగ్య శాఖలో విశేష సేవలందిస్తున్న వైద్యులు, వైద్య సిబ్బంది, ఫార్మసిస్టులను ప్రోత్సహించేందుకు అవార్డులు ప్రకటించారు. ఇందులో భాగంగా కోవిడ్ విపత్కర సమయంలో విశిష్ట సేవలందించినందుకు నల్లకుంట ఫీవర్ ఆస్పత్రి ఫార్మసిస్టు టి. పద్మజ బెస్ట్ ఫార్మసిస్టు అవార్డుకు ఎంపికయ్యారు. వైద్య ఆరోగ్య దినోత్సవ వేడుకల్లో పాల్గొన్న స్థానిక ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్ చేతుల మీదుగా పద్మజ అవార్డును అందుకున్నారు. తెలంగాణ మెడికల్ అండ్ హెల్త్ ఎంప్లాయిస్ యూనియన్ (టీఎంహెచ్ఈయూ) ఆధ్వర్యంలో గురువారం నల్లకుంట ఫీవర్ ఆస్పత్రిలో అవార్డు గ్రహీతకు సన్మాన కార్యక్రమం జరిగింది. టీఎంహెచ్ఈయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జాలిగాల అశోక్ పద్మజను శాలువాతో సన్మానించి, అభినందించారు. లావణ్య, గ్లోరీ, నళిని, మౌనిక, సరిత, ఉమ, నవనీత, విజయ సరిత, రోషన్, శ్రీకాంత్, ముఖేష్ పాల్గొన్నారు.

'అన్ని రాజకీయ పార్టీలు బీసీలకు వ్యతిరేకమే'



సమావేశంలో మాట్లాడుతున్న బర్క కృష్ణ

ముషీరాబాద్: ఎన్నికల సమయం దగ్గరకు వచ్చిన ప్రతిసారి అన్ని రాజకీయ పార్టీల నాయకులు బీసీల ఓట్ల కోసం మాయమాటలు చెప్పి బీసీల అభివృద్ధికి మేమే కృషి చేశామని గొప్పలు చెప్పుకుంటాయి తప్ప ఆచరణలో ఏ రాజకీయ పార్టీ బీసీల అభివృద్ధికి కృషి చేయాలేదని బీసీ సేనా జాతీయ అధ్యక్షులు బర్క కృష్ణ తెలిపారు. గురువారం విద్యానగర్‌లోని బీసీ భవన్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. బీసీలకు బీజేపీ ఎంతో చేసిందని బీజేపీ ఓబీసీ మోర్చా జాతీయ అధ్యక్షులు డాక్టర్ లక్ష్మణ్ చెప్పడం హాస్యంగా ఉందన్నారు. త్వరలో చేపట్టబోయే జనాభా లెక్కల్లో ప్రత్యేకంగా బీసీల జనాభాను కూడా లెక్కించాలని డిమాండ్ చేశారు. అన్ని రాజకీయ పార్టీలు బీసీల అభివృద్ధికి ఎంత బడ్జెట్ కేటాయించారో శ్వేతపత్రం విడుదల చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో కృష్ణాయాదవ్, జే.వి.రావు, వెంకటేష్, హేమంత్ పాల్గొన్నారు.



పనులు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్

రోడ్ల సమగ్రాభివృద్ధికి కృషి

అంబర్‌పేట: నియోజకవర్గంలో రోడ్ల సమగ్ర అభివద్ధికి కృషి చేస్తున్నట్లు ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్ తెలిపారు. గురువారం అంబర్‌పేట డివిజన్ ప్రేమ్‌నగర్‌లో రూ.18 లక్షల అంచనా వ్యయంతో నిర్మించనున్న సీసీ రోడ్డు పనులను ఆయన కార్పొరేటర్ విజయ్‌కుమార్‌గౌడ్‌తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. బస్తీ, కాలనీల్లో ఇప్పటికే రోడ్లను అభివృద్ధి చేశామని వర్షాకాలంలో అభివృద్ధి పనులు పకడ్బందీగా చేపట్టాలని సూచించారు. గడువులోపు చేపట్టిన పనులను పూర్తి చేయాలని ఆదేశించారు.

వ్యక్తిగత కక్షతోనే ఇబ్బంది పెడుతున్నారు

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూలో అధ్యాపకునిగా ఉద్యోగ నియామకానికి రిటైర్మెంట్ తర్వాత నో డ్యూస్ సర్టిఫికెట్ జారీకి సంబంధం లేదని ప్రొ.అన్సారీ పేర్కొన్నారు. ఆయన మాట్లాడుతూ.. కేవలం వ్యక్తిగత కక్షతోనే అధికారులు నో డ్యూస్ సర్టిఫికెట్‌ను ఐదు నెలలుగా ఇవ్వకుండా తిప్పించారని, దీక్ష చేయడంతో ల్యాప్‌టాప్ డ్యూస్ ఉందని పేర్కొనడం విడ్డూరంగా ఉందన్నారు. ప్రస్తుత వీసీ ప్రొ.రవీందర్ గతంలో ఆర్ట్స్ కాలేజీ ప్రిన్సిపల్‌గా కొనసాగినప్పుడు తన నిర్ణయాలను వ్యతిరేకించడంతోనే ఇప్పుడు తనను అనేక ఇబ్బందులకు గురి చేస్తున్నారని ప్రొ.అన్సారీ ఆవేదన వ్యక్తం చేశారు.

ఆరోపణల్లో వాస్తవం లేదు..

ప్రొ.అన్సారీ, అధికారులు పాలక మండలి పై చేస్తున్న ఆరోపణల్లో వాస్తవం లేదని రిజిస్ట్రార్ ప్రొ.లక్ష్మీనారాయణ గురువారం విడుదల చేసిన ప్రకటనలో పేర్కొన్నారు. పదవీ విరమణ తర్వాత రావాల్సిన బెనిఫిట్స్ పై ప్రొ.అన్సారీ చేస్తున్న ఆరోపణల్లో వాస్తవం లేదన్నారు. నిబంధనల ప్రకారం బెనిఫిట్స్ ఇచ్చేందుకు అధికారులు సిద్ధంగా ఉన్నారని కానీ.. ప్రచార, సామాజిక మాధ్యమాలలో ఓయూ అధికారులపై ప్రొ.అన్సారీ తప్పుడు ప్రచారం చేయడం సరికాదన్నారు.

అమరవీరుల వివరాలను అధికారికంగా ప్రకటించాలి



మాట్లాడుతున్న ఎర్ర సత్యనారాయణ

ముషీరాబాద్: ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావం కోసం జరిగిన పోరాటంలో అమరులైన కుటుంబాలకు ఐదు ఎకరాల భూమి ఇవ్వాలని, ఎంతమంది అమరులయ్యారో వివరాలు ప్రకటించాలని బీసీ సంక్షేమ సంఘం తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు ఎర్ర సత్యనారాయణ డిమాండ్ చేశారు. గురువారం విద్యానగర్‌లోని బీసీ భవన్‌లో తెలంగాణ ఉద్యమకారుల వేదిక ఆధ్వర్యంలో ఈ నెల 24న జరిగే తెలంగాణ ఉద్యమకారుల సదస్సు విజయవంతంపై చర్చించి అందులో తీసుకోవాల్సిన నిర్ణయాలు, తీర్మాణాలపై చర్చించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. ప్రభుత్వ విధానాల కారణంగా ప్రజలు తాగుడుకు బానిసై మహిళల పట్ల అత్యాచారాలు పెరిగిపోయాయన్నారు. బాసర ట్రిబుల్ ఐటీలో వరుస మరణాల పట్ల ఆందోళన వ్యక్తం చేశారు. కేసీఆర్, కేటీఆర్ లేకపోయిన తెలంగాణ ఉద్యమం ఉండేదని తెలంగాణ నినాదం లేకపోతే కేటీఆర్ ఉండేవారు కాదని కేసీఆర్ ఆయన కుటుంబ సభ్యులకు ఈ సంపద ఉండేది కాదన్నారు. ఈ సమావేశంలో శంకర్, నిర్మల, దేశ్‌పాండే, ప్రఫుల్‌రెడ్డి, అరుణ, చంద్రుడుయాదవ్, పి.సుధాకర్‌ముదిరాజ్, ధన్వంత, నీల వెంకటేష్, అనంతయ్య పాల్గొన్నారు.

ఆర్యవైశ్యుల సంక్షేమానికి కృషి



డీలక్స్ రూమ్స్ ప్రారంభిస్తున్న ఎమ్మెల్సీ బొగ్గారపు దయానంద్

కాచిగూడ: ఆర్యవైశ్యుల సంక్షేమానికి తమ వంతు కృషి చేస్తామని ఎమ్మెల్సీ బొగ్గారపు దయానంద్ అన్నారు. కాచిగూడలోని వైశ్య హాస్టల్‌లో డీలక్స్ రూమ్స్‌ను గురువారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. సేవా కార్యక్రమాల్లో ఆర్యవైశ్యులు ముందంజలో ఉన్నారని విద్యార్థులు మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా అవకాశాలను అందిపుచ్చుకుని రాణించాలన్నారు. ఆర్యవైశ్యులంతా ఐక్యంగా ఉండి ఒకరికొకరు సహాయ సహకారాలు చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వైశ్య హాస్టల్ ట్రస్ట్‌బోర్డు చైర్మన్ గుడుగుంట్ల ధనంజయ్, కార్యదర్శి విశ్వనాథం నాగేష్, కూర రఘువీర్, హాస్టల్ అధ్యక్షుడు వెంపటి మధు, ఉప్పాల రాజేశ్వర్, పబ్బతి రవి ప్రసన్న కుమార్, బూరుగు సూర్యప్రకాష్ రావు పాల్గొన్నారు.

వార్డు కార్యాలయాల్లో సమస్యలకు సత్వర పరిష్కారం

- నేటి నుంచి అందుబాటులోకి..
- మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్



దివ్యాంగురాలితో కలిసి దుకాణం ప్రారంభిస్తున్న మంత్రి తలసాని

సనత్‌నగర్: క్షేత్రస్థాయిలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల సత్వర పరిష్కారం కోసమే వార్డు కార్యాలయాల ను ఈ నెల 16న (నేడు) ప్రారంభించనున్నట్లు మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ తెలిపారు. చిరు వ్యాపారుల కోసం అమీర్‌పేటలో 10, సనత్‌నగర్‌లో 18 దుకాణాలు నిర్మించగా వాటిని గురువారం మంత్రి ప్రారంభించి మాట్లాడారు. చిరు వ్యాపారుల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని ఈ దుకాణాలు నిర్మించడం జరిగిందన్నారు. జీహెచ్ఎంసీ పరిధిలోని వివిధ విభాగాలకు చెందిన అధికారులు ఈ వార్డు కార్యాలయాల్లో అందుబాటులో ఉంటారని ప్రజలు తమ సమస్యల పరిష్కారం కోసం ఎక్కడికో వెళ్లాల్సిన అవసరం లేదని, వార్డు కార్యాలయాల్లోనే ఫిర్యాదు చేసి పరిష్కరించుకోవాలన్నారు. ఈ విధమైన వ్యవస్థ దేశంలో ఎక్కడా లేదని ప్రజలు ఈ వార్డు కార్యాలయాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత సనత్‌నగర్ నియోజకవర్గ పరిధిలో వందల కోట్ల రూపాయల వ్యయంతో అనేక అభివృద్ధి పనులు చేపట్టి దీర్ఘకాలిక సమస్యలను కూడా చాలా వరకు పరిష్కరించడం జరిగిందన్నారు. నిత్యం ఎంతో రద్దీగా ఉండే ఎర్రగడ్డ–ఫతేనగర్–ఫ్లైఓవర్ వరకు ఉన్న రహదారి విస్తరణ చేసి డివైడర్ల నిర్మాణం చేయడంతో వాహనదారులు, ప్రజలు పడుతున్న ఇబ్బందులను తొలగించామన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ కొలను లక్ష్మీబాల్‌రెడ్డి, మాజీ కార్పొరేటర్ శేషుకుమారి, జోనల్ కమిషనర్ రవికిరణ్, డీఎంసీ మోహన్‌రెడ్డి, ఈఈ ఇందిర, వాటర్‌వర్క్స్ జీఎం హరిశంకర్, నాయకులు బాల్‌రెడ్డి, సురేష్‌గౌడ్, రాజేష్‌ముదిరాజ్, సరాఫ్ సంతోష్, హన్మంతరావు పాల్గొన్నారు.

ఇంటర్ విద్యార్థిని అదృశ్యం

నల్లకుంట: ఓ మైనర్ బాలిక (16) అదృశ్యమైన ఘటన నల్లకుంట పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. సీఐ మొగిలిచర్ల రవి వివరాల ప్రకారం.. అడిక్‌మెట్ మజీద్ లేన్‌లో నివాసముంటున్న విద్యార్థిని (16) బుధవారం ఇంటర్ ఇంప్రూవ్‌మెంట్ పరీక్ష రాసి వచ్చి ఇంట్లో చెప్పకుండా వెళ్లిపోయింది. ఆందోళనకు గురైన కుటుంబ సభ్యులు బంధువులు, తెలిసిన వారితో ఆరా తీసినా ఫలితం లేకపోవడంతో తండ్రి గురువారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. తన కుమార్తె అదృశ్యంపై పవన్ కుమార్ అనే కారు డ్రైవర్‌పై అనుమానం వ్యక్తం చేస్తూ తండ్రి పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు.

క్రీడాకారులకు కేంద్ర ప్రభుత్వం ప్రోత్సాహం

ముషీరాబాద్: దేశవ్యాప్తంగా క్రీడాకారులను ప్రోత్సహించేందుకు కేంద్ర ప్రభుత్వం పెద్ద ఎత్తున నిధులు కేటాయించిందని ఎంపీ డాక్టర్ లక్ష్మణ్ అన్నారు. గురువారం ముషీరాబాద్ డివిజన్‌లోని ఎంసీహెచ్ కాలనీలోని స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో క్రీడాకారులకు వివి ధ రకాల క్రీడా సామగ్రిని ముషీరాబాద్ బీజేపీ జా యింట్ కన్వీనర్ ఎం.నవీన్‌గౌడ్ ఆధ్వర్యంలో పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన లక్ష్మణ్ మాట్లాడుతూ.. యువత క్రీడలపై దృష్టి సారించాలని సూచించారు. ప్రధాని మోదీ క్రీడాకారులను ఆయా రంగాలలో ప్రోత్సహించేందుకు పెద్ద ఎత్తున బడ్జెట్ కేటాయించారని తెలిపారు. క్రీడాకారులు క్రీడల్లో రాణిస్తూ అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు పొందాలని సూచించారు. ఈ సందర్భంగా నవీన్‌గౌడ్ డాక్టర్ కె.లక్ష్మణ్‌ను క్రీడాకారులతో కలిసి ఘనంగా సన్మానించారు. బద్రినారాయణ, ఓబీసీ సత్యనారాయణచారి, లక్ష్మణ్ పాల్గొన్నారు.

నియామకం

కాచిగూడ: బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శిగా చిటికెల గోవింద్‌ను నియమిస్తూ జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు, ఆర్.కృష్ణయ్య నియామక పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా గోవింద్ మాట్లాడుతూ.. బీసీ సంక్షేమ సంఘం అభివృద్ధి కోసం కృషి చేస్తానని అన్నారు. ఆర్.కృష్ణయ్య ఇచ్చిన పిలుపు మేరకు రెండు తెలుగు రాష్ట్రాల్లో కార్యక్రమాలను పూర్తి స్థాయిలో విజయవంతం చేయడానికి కృషి చేస్తానని అన్నారు.

ప్రజా సేవకులకు మంచి గుర్తింపు లభిస్తుంది

అడ్డగుట్ట: అంకితభావంతో ప్రజలకు సేవలందించే వారికి మంచి గుర్తింపు లభిస్తుందని లయన్స్ క్లబ్ ఇంటర్నేషనల్ డిస్ట్రిక్ట్ గవర్నర్ వెంకట్ నారాయణ రెడ్డి అన్నారు. ఇంజినీర్స్ డే ను పురస్కరించుకొని గురువారం సికింద్రాబాద్‌లో లయన్స్ క్లబ్ ఇంటర్నేషనల్ డిస్ట్రిక్ట్ 320–సీ క్యాబినెట్ సమావేశం జరిగింది. సికింద్రాబాద్‌లో 2022–23 సంవత్సరంలో లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ప్రజలకు సేవలందించిన వారికి అవార్డులు అందజేసి సన్మానించారు. అందులో భాగంగా లాలాగూడ వర్క్‌షాప్‌కు చెందిన లయన్స్ క్లబ్ ఇంటర్నేషనల్ చైర్ పర్సన్ శ్యామ్ రావును ఘనంగా సత్కరించారు.